# కన్నీటిలో పన్నీరు

నాకు శరీరమే కాదు, సుఖదుఃఖాలను అనుభవించగల మనసు కూడా ఉందని "ప్రేమ్‌సింగ్" కీ వాడి తమ్ముడు 'భాగా' కీ ఎన్నడూ తోచదేమో! ఇద్దరూ ఇద్దరే. ప్రేమ అన్న పదానికి అర్థమే తెలియనివాడు ఆ పెద్దవాడు. వాడి తమ్ముడు అసలు పేరు భగత్‌సింగ్ అట. వాణ్ణి భాగా – భాగా అని సంక్షిప్తంగా పిలుస్తూ ఉంటాడు వాడి అన్న. ఆ భాగాలో దైవత్వం ఏ కోశానా కనపడదు కదా! ఈ అపూర్వ సహోదరులు – రోజుకొకరికి నా సేవల్ని అంకితం చేసెయ్యడం, డబ్బు జేబులో వేసుకుని వాళ్ళ పబ్బం గడుపుకోవడం తప్ప వేరే పరమార్థం లేనేలేదు వాళ్ళకి.

వాళ్ల వ్యాపారంలో కేవలం నేనో పెట్టుబడిని. నా మీద వచ్చే ఆదాయం మీదే వాళ్ళ ధ్యాస అంతానూ. అయితే నా యాంత్రిక జీవితంలో ఊరట కలిగించే విషయం ఒక్కటుంది. నాలా జీవించే నిర్భాగ్యులు చాలా ఉన్నారు. అందరం కలుసుకుని తరచుగా ఒకరి కష్టాల్ని ఇంకొకరితో చెప్పుకుంటాం. నాకంటే కష్టజీవుల్నీ ఆరోగ్య హీనుల్నీ చూసినపుడు ఈనాటికి నేనే కాసింత నయం అని నిట్టూరుస్తాను.

ఈ అన్నదమ్ముల్నీ వీళ్ళలాగే వ్యాపారం సాగించే వాళ్ళనీ వాళ్ళ గడుసుతనాన్నీ తలుచుకుంటే ఇంత కష్టంలోనూ నవ్వువస్తుంది. మాకు ఆకర్షణ కోసం వింత వింత పేర్లుపెడతారు. హీరా, మోతీ, బసంతీ, కల్మా ఇలా అందమైన పేర్లు. వ్యాపారం ముమ్మరంగా సాగే రోజుల్లో అయితే మాకు చేసే అలంకరణ కూడా వర్ణనాతీతమే. నా పేరు చూడండి. హీరా! అంటే వజ్రం అన్న మాటే. వీళ్ళ వ్యాపారంలో నాలుగేళ్ళుగా నలుగుతున్నాను. ఒక్కరోజైనా సెలవుకానీ, కాసింత విశ్రాంతికానీ ఎరగను. విశ్రాంతి కావాలంటే ఏ ఉపద్రవమో హిమపాతమో తుఫానో రావలసిందే. అలా ఎప్పుడైనా అంతరాయం వచ్చి వ్యాపారం దెబ్బతింటే ఇద్దరూ విలవిలలాడిపోతారు.

ముసురు పట్టిన రాత్రి ఆకాశంలో చంద్రుడు కనపడినట్టు నా చిన్ననాటి జ్ఞాపకాలు

ఒకటీ, రెండూ మసగమసగ్గా నాకంటి ముందు అప్పుడప్పుడు కదలాడుతాయి. పాపం ఆ కల్కాకి అలాటి జ్ఞాపకాలు లేవంటుంది. ఎంత దురదృష్టం ?

గునగునలాడుతూ తల్లిపాలు తాగుతూ వుంటే మా అమ్మ తనివితీరా నన్ను ముద్దులతో ముంచి నా ఒళ్ళంతా ప్రేమతో నిమిరేది. పసిమి నిండిన ప్రకృతి నాలుగు వేపులా పరచుకుని ఉంటే అలా ఆశ్చర్యంతో చూస్తూ పరవశించిపోవడం లీలగా గుర్తుంది. ఉరుకుతూ ఉత్సాహంగా గడపడం కూడా కాస్త జ్ఞాపకం ఉంది. ఈ ప్రపంచం ఎంత అందంగా ఉంది ఈ బతుకు ఎంత హాయిగా ఉంది, అనుకునే దాన్ని కొన్నాళ్ళకే ఆ బతుక్కి తెరపడింది. అగచాట్లుమొదలు. నేను ఎన్నో చేతులు మారిపోయాను. అమ్మ మరి నాకు కనపడ లేదు. ఆ తర్వాత ఈ అపూర్వ సహోదరులు రంగప్రవేశం చేసినట్టు గుర్తుంది. వాళ్ళలో ఒకడు రోజూ పనికట్టుకు రావడం. నావేపు ఆశగా చూడడం. ఏవో గుసగుస లాడుకుంటూ వెళ్ళిపోవడం. ఇలా నాలుగు రోజులు గడిచాక ఇద్దరూ వచ్చి నన్ను వెంటబెట్టుకుని పోయారు. అంగడిలో వస్తువునై వాళ్ళకు నేను అమ్ముడు పోయినట్లు నాకా వయసులో తెలియలేదు.

కొన్ని రోజులు ఎంతో ప్రేమగా నన్ను చూసినట్టే కనబడ్డారు. మంచి ఆహారం తినిపించే వారు. చిన్న చిన్న బరువు బాధ్యతలు అప్పగిస్తే అదేదో ప్రత్యేకమైన గౌరవంగా భావించి శ్రద్ధగా నిర్వహించేదాన్ని. అదంతా నా స్వభావాన్నీ సహనాన్నీ అంచనావేసే ప్రయత్నమని కొన్నాళ్ళ అనుభవంతో కానీ అర్థం కాలేదు. నేనలా తొలిదశలో మంచిపేరుకోసం ఆరాటపడ్డం నిజానికి పొరపాటే. బాధ్యతలు పెరిగాయి. క్రమంగా నేనూ నాది అన్న స్పృహ, స్వాతంత్ర్యం కోల్పోయాను. వాళ్ల వ్యాపారంలో పెట్టుబడిని. శ్రమనాది, ఆదాయం వాళ్లది. వాళ్ల పరిభాషకీ బూతులకీ అలవాటు పడిపోయాను. జీవితం యాంత్రికంగా మారిపోయింది.

ఈ ప్రేమ్‌సింగ్ గాడూ వాడి తమ్ముడూ తోటి వ్యాపారస్తులతో కలిసి ఒకరి గొప్పలు ఇంకొకరితోనూ ఒకరి ప్రయోజకత్వం ఇంకొక రితోనూ చెప్పుకునే సందర్భాలలో నా పుట్టుపూర్వోత్తరాలు కొంతగా చెవిన పడ్డాయి. నేను చంద్రపురిలో పుట్టానట. గుపత్‌కాశీలో పెరిగానట. ఎక్కడ పెరిగితే ఏం ఒరిగిందని ! వాళ్ళ బతుకుల్ని హాయిగా మలచుకున్నారు. నన్ను నాలుగు వేలకి బేరమాడి కొనుక్కున్నారట. రోజుకి కనీసం మూడు వందలార్జిస్తారు. అవకాశం ఉన్న గిరాకీ రోజుల్లో అయితే ఆరువందలు మించుతుంది. అంటే, నన్ను కొనుక్కున్న ధర మీద చక్రవడ్డీతో సహా ఈ సరికే ఆర్జించేసుకున్నారన్న మాట.

నాకు తగిలించే అలంకారాలు, ఆడంబరాలు నామీద ప్రేమతో చెయ్యలేదని ఒక

రోజున నేను తప్పించుకుపోయే ప్రయత్నం చేసినప్పుడు తెలిసిపోయింది. నా ఉనికినీ గమనాన్నీ సులభంగా వాళ్ళకు తెలిసే ఏర్పాటులో నా అలంకారాలు ఒక భాగం అని తెలుసుకున్నాను. నేను ఆ రోజు తిన్న తిట్లూ దెబ్బలూ ఈ నాటికీ జ్ఞాపకం ఉండి పోయాయి. ఇంకోమారు అలాటి ప్రయత్నం చెయ్యలేదు.

ఇష్టం లేకున్నా ఉదయాన్నే పిల్లల్ని నిద్ర లేపి, స్కూలు దుస్తులు వేసి, సంచులు తగిలించి బడికి పంపినట్లు నాకు నా అధిపతులిద్దరూ నిద్రలేపి, ముస్తాబు చేసి అంగడి సిద్ధం చేస్తారు. నా గమ్యం, మార్గం స్పష్టంగా తెలిసినా నా సేవల్ని ఆ రోజు కొనుక్కున్న వాళ్ళెవరన్న ప్రశ్న కాసింత ఉత్కంఠ కలిగిస్తుంది. ఒక్కొక్కప్పుడు ప్రేమ్‌సింగ్ తొలిరోజు సాయంత్రమే పైకం అడ్వాన్సుగా తీసుకుని నన్ను మరుసటిరోజుకి ఎవరికో అంకితం చేసేస్తాడు. కొందరికి నన్ను చూడగానే భయమో, ఆవేశమో, ఉన్మాదమో కలుగుతుందనిపిస్తుంది. విచిత్రంగా ప్రవర్తిస్తారు. ఎన్నడూ ఇది వరకు ఎరిగివావని అనుభవానికి గురైనట్టు అరుపులు, మోకాలి పొడుపులు గుట్కా నమిలేవాడొకడైతే, మసాలా కారా కిళ్లీ నమిలే వాడొకడు. ఇలా రోజుకో ప్రవర్తనా, రోజుకో భాష నాకు అలవాటే. అన్నీ వింటూ, ఏదీ నాకు పట్టనట్టు తలవంచుకుని ఆ రోజు గడిస్తే బతుకు జీవుడా! అనుకుంటాను. ఒక యాంత్రికతకు లోబడి నాబతుకు వలయం తిరుగుతుంది. ఇలా సాగే నా మార్గంలో ప్రతీ మలుపూ రాయీ, రప్పా, కష్టం. సుఖం కళ్ళు మూసుకుని కూడా చెప్పగలను. కొత్తదనం అన్నది అసలు లేనేలేదు. ఎన్నడైనా కాసింత విరామం దక్కితే ఆ క్షణం అలా ఉండిపోయి కాలచక్రం కదలక నిలిచిపోతే ఎంత హాయిగా ఉంటుంది. అని వెర్రిగా ఆలోచిస్తూ వుంటాను.

ఇటువంటి యాంత్రిక జీవితంలో చెప్పుకో వలసిందేమిటుంటుంది అని అనుకునే దాన్ని. కానీ, ఇవాళ జరిగినది అందుకు భిన్నంగా ఉంది. చెప్పకుండాఎలా ఉండగలను? చిట్ట చీకటిలో చిన్న కాంతి కిరణం చొరబడితే అటుచూడకుండా, చేతిలోకి తీసుకుని దాచేసుకోవాలి అనుకోకుండా నిర్లిప్తంగా ఉండడంఎలా సాధ్యం?

నా సేవలు కొనుక్కున్న శాస్త్రి ఇంత తేలికగా ఉందేమిటా అని ఆశ్చర్యంవేసింది ఆ మానవాకారంలో హృదయం అన్న పదార్థం ఉండడం వల్లనే అలా తేలికగా ఉన్నట్లు తోచి ఉంటుంది. నాటకంలో పాత్రలాగ మాటిమాటికీ స్వగతాలు వల్లిస్తున్నాడు. అప్పుడప్పుడు తన మృదువైన చేతులతో సున్నితంగా నన్ను తాకుతూ నా మెడని నిమురుతున్నాడు. అలా ఎన్నడూ ఎరగని దయా ఆత్మీయతా ఎదురవగానే నేను అవ్యక్తానందంలో మునిగిపోయాను.

ఒక సాటి ప్రాణిగా నన్ను గుర్తించిన వాళ్ళు అరుదు. అంతా అవసరాలు తీర్చుకుని నావేపైనా తిరిగి చూడకుండా పోయేవాళ్లే నామీద ఉన్నది మానవశరీరం కాదు ఒక పూలదండ అనుకునేటంత తేలికగా ఉన్నట్టు తోచింది. ప్రేమా అభిమానం అందుకున్నప్పుడు నాలో చిన్ననాటనే అణగారిపోయిన భావుకత చిత్రంగా మేల్కొంది. రోజూ చూసిన వస్తువులే కొత్త అందాలు తొడుక్కున్నాయి.

నీరెండలో మెరుస్తూ పచ్చని తివాచీలు పరచినట్టున్న కొండచరియలు, కొండ శిఖరాల్ని తాకుతూపోతున్న తెలిమబ్బులు, లోయలోకి దూకుతూ వెండితీగల్లా ఉన్న వాగులు, తుళ్లింతలతో గలగల పారుతున్న మందాకినీ నది, కువకువలాడుతూ ఎగిరే పలురకాల పక్షులు, ఒకటేమిటి, కంటి ముందున్న ప్రతీ దృశ్యం మనోజ్ఞంగా తోచి మనసుకి హత్తుకుంది.

"నీసంపాదన మీద బతుకుతున్నవాళ్లు నీకు కనీసం బలమైన ఆహారమన్నా పెడుతున్నట్టు లేదు " అని వాపోతున్న గొంతులోని కారుణ్యం, నేను ఎన్నడూ వినని సంగీతంలా నా చెవులకు సోకింది.

ఇంతలోనే కర్కశంగా ఎక్కడనుంచో దూరంగా భాగాగాడి కంఠం వినిపించి నన్ను వాస్తవంలోకి లాక్కొచ్చింది. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరిగినట్టు నా చుట్టూ అపూర్వ సహోదరుల్లో ఎవడో ఒకడుఉండక తప్పదు కదా. నా తలపైకెత్తి చూశాను. రాంబాడా మజిలీ అని గుర్తించాను. మోతీ, కల్మా-నాకన్నా ముందే అక్కడకు చేరుకున్నట్టున్నారు. అది లాభసాటిగా సుందరలాల్ సాగిస్తున్న తేనీటి దుకాణం. ఎక్కడో సోన్ ప్రయాగ నుంచి వచ్చి ఇక్కడ లాభసాటిగా గడిస్తున్నాడు సుందరలాల్. నన్ను ఓరకంట చూసి నాతోపాటూ వచ్చిన శాల్తీని వింతగా పరికిస్తోంది కల్మా.

అక్కడకు చేరిన పెద్దమనుషులంతా అప్పుడే వేడివేడిగా రొట్టెలు, మొక్కజొన్న బుట్టలు కాల్పించుకుని తింటున్నారు. కొందరు వేడివేడిగా తేనీటిని ఊదుకుంటూ తాగుతున్నారు. అక్కడ పరిచి ఉన్న చాపల మీద, ..ండ్ల మీద నడుంవాల్చి కొందరు అలసట తీర్చుకుంటున్నారు. ఇలా ఇక్కడ కూలబడితే ఇక లేవాలనే ఉండదు. తిరుగు ప్రయాణం ఆలస్యమై పోతుంది అని కొందరు ఆత్రంగా తేనీరు తాగి ముందుకు సాగిపోతున్నారు.

భాగా పరుగులాంటి నడకతో వచ్చి నాతో ఉన్న పెద్దమనిషినుద్దేశించి " ఛాయ్" తాగుతూ ఉండండి. నేను ఇప్పుడే వస్తాని చెప్పి ఎక్కడికో మాయమైపోయాడు. ఆ పెద్దమనిషి వయసులో

కూడా పెద్దవాడే కావడం వల్ల బాగా అలసినట్టున్నాడు. మోకాలి పిక్కల్ని గట్టిగా రెండు చేతులతోనూ ఓమారు రాసుకున్నాడు. నిటారుగా నిలబడి తనరెండు పిడికిళ్లతోనూ నడుంభాగం మీద కొట్టుకున్నాడు. తర్వాత నా కళ్లలోకి జాలిగా చూశాడు. కడుపులో చల్ల కదలకుండా కూర్చుని నేనింతగా అలసిపోయాను. కాళ్ళు తిమ్మిరెక్కి నడుం పట్టినట్టయిపోయింది. మరి నీ కష్టం ఎవరితోచెప్పుకుంటావు పాపం అని వెనక్కు తిరిగి సుందరలాల్ దుకాణం అంతా ఓమారు కలయజూశాడు. అక్కడ ఉన్న లోటాతో నీళ్లు తీసుకుని, చేతులు కడుక్కుని, మొహం మీద నీళ్ళు జల్లుకుని రుమాలుతో తుడుచుకున్నాడు. రెండు సూకా రొట్టెలు, తేనీరూ సిద్ధం చెయ్యమని చెప్పాడు. ఇంతలోనే ఆ దుకాణం మీదఉన్న వస్తువేదో ఆకర్షిస్తే అటుగా చూశాడు. మూతలేని తట్టలో పెద్ద పెద్ద ఉండలు చూశాడు.

"ఏమిటవి ?" అడిగాడు

" బెల్లపుండలు" సుందర్‌లాల్ ఇచ్చిన జవాబు.

"అంతంత ఉండలు ఎవరు తింటారు ?". ఆశ్చర్యంగా ప్రశ్నిస్తూ పకపక నవ్వాడు సుందరలాల్.

"మనుషులు తినడానికి కాదు" గుర్రాలు ఇష్టంగా తింటాయి అన్నాడు.

"ఒక్కొక్కటీ ఎంత ?"

" మూడు రూపాయలకొక ఉండ."

జేబులోంచి ఒక నోటు తీసి అందిస్తూ రెండు ఉండలు ఇలా ఇయ్యి అన్నాడు ముసలాయన. నావేపు తిరిగి ఆ రెండు ఉండల్నీ చూపించే దాకా అవి నా కోసం కొన్నవని అర్థం కాలేదు. నేను ఎంత కష్టపడి వాళ్ళకు సంపాదించి పెడుతున్నా అపూర్వ సహోదరులు నాకుఈ ఉండలు కొని పెట్టడానికి ఏడుస్తారు. ఎంతసేపూ ఉల్వాగాదారికే గడ్డి నా మొహాన రోజూ పారేస్తారు – తినమని . నేను నాలుకతో ఆ ఉండల్ని ఒక దాని తర్వాత ఇంకొకటి అందుకుని తృప్తిగా చప్పరిస్తూ తింటూవుంటే నా కళ్ళలోకి తృప్తిగా చూస్తూ మళ్ళా ఏదో స్వగతాన్ని ప్రకాశంగానే వల్లిస్తున్నాడు.

"ఈ వాహనయోగం నా కొద్దు మొర్రో అని ఎంత చెప్పినా నా మాట చెవిని పెడితేనా,. ఈ కొండల మధ్య నువ్వుఅడ్డం పడితే మా బాధ ఆ కేదారనాథుడికే ఎరిక "అంటూ నన్ను నడవనివ్వలేదు. నేనూ ఈ వార్థక్యంలో అస్వతంత్రుణ్ణి" అని పదేపదే అనుకుంటున్నాడు.

ఈ మాటలు వింటూ రుచిగా బెల్లపుండల్ని చప్పరిస్తున్న నాకు నవ్వు రాక ఏమౌతుంది ? ఎంత సత్తెకాలంవాడు నా అతిథి. ఈ శాస్త్రీ నన్ను ఎక్కకుండా ఉంటే మాత్రం భాగా ఊరుకుంటాడా ? నాకు విశ్రాంతిని ప్రసాదిస్తాడా ? ఇంకొకడి పరం చేసి వాడి రాబడిని వాడు వసూలు చేసుకోడూ ?

తియ్యగా నెమరువేసుకుందుకు నా జ్ఞాపకాల్లో ఒక రోజైనా ఇలా మిగిలేదా ? మీరే చెప్పండి.

- ఈనాడు ఆదివారం **21 జూన్ 1998**